## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

నూతనంగా ఏర్పడిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు రెండవ నూతన కలెక్టర్‌గా ఆర్.మహేష్ కుమార్ గురువారం స్థానిక కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెసి ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి జి.కేశవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న జెసి

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

- పాల్గొన్న ఎస్ఎఫ్ఐ, పివైఎల్, పిడిఎస్‌యు, ఐఎఫ్‌టియు, ఎఐఎస్ఎఫ్ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణలో భాగంగా గురువారం దేశవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతమైందని ఎస్ఎస్ఐ, పిడిఎస్‌యు, ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు.

**అమలాపురం:** విద్యార్థి సంఘాలు ఐక్య కార్యచరణలో బాగంగా జులై 4వ తేదీన దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ కు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్ఎఫ్ఐ ఆ్వర్యంలో అమలాపురం పట్టణం ఇతర మండలాల్లో వివిధ విద్యా సంస్థలను బంద్ చేయించారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ కె.ప్రణీత్ , కె.శంకర్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయస్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందన్నారు. తీవ్రమైన అవకతవకలు, వ్యత్యాశాలతో, భాధ్యతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారన్నారు. నీట్ పరీక్షా లీకేజ్ తెరవెనుక కుంభకోణం నీట్- పిజి పరీక్షను 12గంటలు ముందు వాయిదా వేయడం, యూజిసి నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. నీట్ స్కామ్ పై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని దేశ వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని వారు తెలిపారు. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్యా పరిస్థితి కూడా దారుణంగా ఉన్నాయని బిజెపి పాలనలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపుల్లో కోత, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గడం జరిగిందని వారు వాపోయారు.2018-19, 2021-22 మధ్య దేశంలో 61885 పాఠశాలలు మూసి వేశారన్నారు. దేశంలో విద్య మరియు ప్రజాస్వామ్యం పై దాడికి వ్యతిరేకంగా జులై4న దేశ వ్యాప్తంగా కెజి నుంచి పిజి వరకూ విద్యా సంస్థల బంద్‌కు ఐక్య విద్యార్థి సంఘాలు పిలుపులో అన్ని విద్యా సంస్థలు పాల్గొని జయప్రదం చేసినందుకు వారి ధన్యవాదాలు తెలిపారు.



కొంకాపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో బంద్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**పిడిఎస్ యు ఆధ్వర్యంలో**

దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా పిడిఎస్ యు ఆధ్వర్యంలో అమలాపురంలో ప్రభుత్వ, ప్రయివేటు కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులు సంపూర్ణంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కన్వీనర్ సాపే రమేష్ బహుజన స్టూడెంట్ నాయకులు పాలమూరు మోహన్ బాబు పాల్గొన్నారు. **ఆలమూరు:** మండల పరిధి 18 గ్రామాలలో విద్యాసంస్థల బంద్ జయప్రదం అయినట్లు ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రవికుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్, ఎస్‌టియు తదితర ఉపాధ్యాయ సంఘాల నేతలకు ముందుగానే వినతి పత్రాలు ఇచ్చి బందు జయప్రదానికి సహకరించాలని కోరినట్లు ఆయన అన్నారు. ఇందులో భాగంగా డిమాండ్లు తెలిపారు. నీట్ పరీక్షను కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలి, నీట్ ప్రశ్న పత్రం లీకులకు కారణమైన సంస్థను రద్దు చేయాలి, రాష్ట్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి అని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. **రామచంద్రపురం:** నీట్ పరీక్షను రద్దు చేయాలని గురువారం దేశవ్యాప్తంగా తలపెట్టిన విద్యాసంస్థల బంద్ రామచంద్రపురంలో విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా పివైఎల్ జిల్లా నాయకులు వీ.భీమశంకరం, ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి, పిడిఎస్‌యు నాయకులు ప్రశాంత్, కరుణాకర్,మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలలో ఒక్కొక్క విద్యార్థి నుండి రూ .30 నుండి 40 లక్షల వరకు వసూలు చేసి పేపర్ లీకే చేశారని బహిరంగంగా చెబుతున్నా కేంద్ర ప్రభుత్వం వారిపైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు.ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలు నీట్ పరీక్షను రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీట్ పరీక్ష పైన ఏమాత్రం కూడా మాట్లాడడం లేదు తక్షణమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నీట్ పరీక్ష రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేయాలన్నారు. యూనివర్సిటీ లో విద్యార్థి సంఘాలు నాయకుల పై అక్రమ కేసులనుఎత్తివేయాలి. దేశ వ్యాప్తంగా పాఠశాలలు మూసి వేతను విరమించుకోవాలని, స్కాలర్ షిప్ - ఫీజు రీయింబర్స్ మెంట్ పాత బకాయిలు చెల్లించాలని నినాదాలు చేశారు. రామచంద్రపురం లో కార్పొరేట్, ప్రయివేటు ప్రభుత్వా విద్యా సంస్థలు సంపూర్ణంగా బంద్‌లో పాల్గొన్నాయి. దేశ వ్యాప్తబంద్ విజయవంతం అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు హరీష్, యశ్వంత్, వీరబాబు, సత్య సాయి, గౌతమ్,తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో యుటిఎఫ్ నేత రమణకు వినతిపత్రం ఇస్తున్న ఎఐఎస్ఎఫ్ నేతలు




రామచంద్రపురం జూనియర్ కాలేజీ వద్ద బంద్ చేస్తున్న పిడిఎస్‌యు నాయకులు

## ఎంఎల్‌సి ఐవిని పరామర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి-అమలాపురం

ఇటీవల అనారోగ్యానికి గురైన ఉభయ తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి)ని గురువారం అమలాపురం విద్యుత్ నగర్ ఆయన నివాసంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ప్రముఖ సామాజికవేత్త జై ఆంధ్ర ఉద్యమ నాయకుడు చలసాని శ్రీనివాసరావు బృందం పరామర్శించారు. ఎంఎల్‌సి ఐవి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాజకీయ, సామాజిక అంశాలపై కూడా చర్చించినట్లు వివరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు గుదే దుర్గాప్రసాద్, కె.శంకర్, టి.మోహన్‌రావు, పాలమూరు శ్రీనివాసరావు, వివిధప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఐవిని పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

## మానికొండ సూర్యావతికి 'ఐద్వా' నాయకుల నివాళి

ప్రజాశక్తి-అమలాపురం

మహిళా సంఘం ఐద్వా ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన మానికొండ సూర్యావతి వర్ధంతి సందర్భంగా గురువారం అమలాపురం నారాయణ పేట, కార్మిక నగర్లో వర్ధంతి సభలు నిర్వహించారు. సూర్యావతి మహిళా సంఘానికి చేసిన సేవలు కొనియాడారు. సూర్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి నాగ వరలక్ష్మి మాట్లాడుతూ1941 లో మహిళా సంఘం కార్యదర్శిగా పనిచేశారన్నారు. మహిళలహక్కులపై ప్రచారం చేయటం వంటి కార్యక్రమాలతో నిరంతరం మహిళలను చైతన్య పరుస్తూ ఉండేవారన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అమిద్ ఉనిషా, టౌన్ కార్యదర్శి సీతారత్నం, వాసవి, దుర్గాదేవి, దరియా, జె.వీరలక్ష్మి, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.



సూర్యావతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

## అక్విడెక్ట్‌లను పరిశీలించిన ఎంఎల్ఎ 'గిడ్డి'

ప్రజాశక్తి-మామిడికుదురు

వైనతేయ గోదావరి నదీపాయపై ఉన్న డొక్కా సీతమ్మ, ఆర్థర్ కాటన్ పాత అక్విడెక్ట్‌ల దుస్థితిని గురువారం పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్య నారాయణ పరిశీలించారు. సీతమ్మ వారధిపై పెద్ద గోతులతో, ఐరన్ ఊచలు బయటకు వచ్చి ప్రమాదకర స్థితిలో ఉన్నా పట్టించుకోని ఇరిగేషన్ అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ డిఇఇ వెంకటేశ్వరరావుతో కలిసి పాత, కొత్త అక్విడెక్ట్‌లపై నడిచి ప్రతీ గుంత పరిశీలించారు. తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వర్షం నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. రెండవ అక్విడెక్ట్‌లో అక్కడక్కడా మొలిచిన మొక్కలు తొలగించాలన్నారు. పాత అక్విడెక్ట్ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకువెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్, సర్పంచ్ బొండాడ నాగమణి, టిడిఇ కో కన్వీనర్ డివివి.సత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరం అక్విడెక్ట్ గోతులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి, ఇరిగేషన్ డిఇఇ

### ప్రయివేటు పాఠశాలల్లో సదుపాయాలు లేకపోతే చర్యలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం


విద్యా సంవత్సరం 2024-2025లో ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రయివేట్ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల లేకపోతే చర్యలు తీసుకుంటామని ఎంఇఒపి.వి.ప్రసాదరావు హెచ్చరించారు. గురువారం ప్రయివేటు పాఠశాలను పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలైన గాలి, వెలుతురు, తాగునీరు, పరిశుభ్రమైన టాయిలెట్లు,ఇతర మౌలిక సదుపాయాలు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలకు లోబడి, విద్యా ర్థుల ప్రవేశాలు చేయాలన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో తగిన అర్హత కలిగి, బోధనా నుభవం ఉన్న వారిని మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించుకోవాల న్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాట్రేనికోన

విద్యుత్ సరఫరాకు నేడు శుక్రవారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కాట్రేనికోన మండల పరిధిలో 11 కెవి ఫీడర్, పల్లంకూరు 11 కెవి ఫీడర్లలో ఓవర్ లోడ్ కారణంగా వర్క్ చేస్తారన్నారు చెట్లు తొలగింపు పనులు చేపట్టడతారన్నారు. కాట్రేనికోన, గెద్దనాపల్లి, కొప్పిగుంట, పల్లం, కందికుప్పు, పల్లంకూరు, బలుసు తిప్ప, మొలేటిమొగ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారన్నారు.

కార్టూ'నిజం'



# విప్లవ వీరుడు 'అల్లూరి'కి ఘన నివాళి



వెలగతోడులో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127 వ జయంతిని గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**అమలాపురం :** అల్లూరి సీతారామరాజు జయంతిని జిల్లా కలెక్టర్ కార్యాల యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తదితరులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు జిల్లా రెవెన్యూ అధికారి ఎం వెంకటేశ్వర్లు,కోనేరు రంగారావు సిఫార్సుల కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మదన్మోహన్రావు, మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం కలెక్టరేట్ లోని వివిధ విభాగాల రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా స్థానిక అమలాపురం గొల్లగూడెం సిపిఎం కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పూలమాలవేసి ఘనమైన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశభక్తి చాటిన మహోన్నతమైన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కే శంకర్, పొలమూరి శ్రీనివాసరావు, కె ప్రణీత్, దిలీప్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం (అల్లవరం):** కోడూరుపాడు గ్రామంలోఅల్లూరి సీతారామరాజు జయంతిని మండల టిడిపి అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు, కోడూరుపాడు సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు పాల్గొని సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కడియం(మండపేట):** బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలోమండలం లోని వెలగతోడు గ్రామంలో అల్లూరి సీతారామరాజు జయంతినిర్వహించారు. సిఐటియు జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి పాల్గొన్ని మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు పోరాటపటిమను నేటి యువత అలవర్చుకోవాలన్నారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పిండి కాళిదాసు అధ్యక్షతన జరిగిన అల్లూరి జయంతి కార్యక్రమంలో కృష్ణవేణి పాల్గొని సిఐటియూ పతాకావిష్కరణ చేసి అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. బలరాం మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కూటమి ప్రభుత్వం పునరుద్ధరిం చాలన్నారు. యూనియన్ కుటుంబ సభ్యులు సమాకూర్చిన చీరలను పేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో సిఐటియు నాయకులు ఎం. భాస్కరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వజ్రం, సత్య, విజయ, శివ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు, స్కూల్ కంటినజెంట్ యూనియన్ నాయకులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బల్ల నాగేశ్వరరావు, ఆది గణేష్, రావూరి వెంకట్రావు, పిల్లి నాగార్జున, ఎస్. రాజు పాల్గొన్నారు. **కొత్తపేట:** డిగ్రీ కళాశాల రావులపాలెం నందు కళాశాల ప్రిన్సిబల్ డాక్టర్ వి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు.కార్యక్రమంలో అధ్యాపకులు సిద్ధార్థ, హరిబాబు, సత్యమూర్తి ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్ అరుణ్ కుమార్,యువరాజు తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం:** పట్టణంలో అల్లూరి జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గంకాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోట శ్రీనివాసరావు, రామచంద్రపురం టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్‌డిఖాం తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** కండ్రికపేట ఎంపిపి పాఠశాల నందు యుటిఎఫ్ మండల అధ్యక్షుడు, ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయులు అద్దరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల చేత సీతారామరాజు వేషధారణతో విప్లవ గీతాలను ఆలపింప చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సహోపాధ్యాయులు పిల్లి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** భీమనపల్లి శ్రీ శిరంగు రంగనాయకమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీతారామరాజు చిత్రపటానికి ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల జరిగిన ఒలింపిక్ రన్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆరవ నాయుడు, నడింపల్లి పద్మనాభన్ తదితరులు పాల్గొన్నారు. **అయినవిల్లి:** ముక్తేశ్వరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అల్లూరి జయంతిని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు తదితరులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జి. సాయి శ్రీనివాస్, కే.సిద్ధార్థ ప్రసాద్, పాల్గొన్నారు. **ఆత్రేయపురం:** ఆత్రేయపురం అల్లూరి సీతారామరాజు సెంటర్ వద్ద ఉన్న సీతారామరాజు విగ్రహానికి అల్లూరి సీతారామరాజు పార్క్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు పూలమాలలు వేశారు ఆయన చేసిన సేవలను కొనియాడారు. **ముమ్మిడివరం:** ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బళ్లగేటు సెంటర్ లోని సిపిఎం కార్యాలయం అవరణలో గురువారం సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యం లో అల్లూరి జయంతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్టీ సీనియర్ నాయకుడు మరియు వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పాము బాలయ్య అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు సఖిలే సూర్యనారాయణ, దొమ్మేటి వీర రాఘవులు, కెవిపిఎస్ నాయకులు నిమ్మకాయల వెంకటేష్, యలమంచిలి బాలరాజు, పలివెల ప్రసాద్, నిమ్మకాయల మహాలక్ష్మి లక్ష్మీ లతో పాటు పలువురు పాల్గొన్నారు.అలాగే నగర పంచాయతీ కార్యాలయం నందు కమిషనర్ జి.వెంకట రామీ రెడ్డి అధ్యక్షతన జరిగిన అల్లూరి జయంతి నిర్వహించారు. వేడుకల్లో చైర్మన్ కమి డి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. చిన కొత్తలంక గ్రామంలో పి ఉదయ భాస్కర వర్మ అద్వ ర్యంలో జరిగిన అల్లూరి జయంతి నిర్వహించారు. **కపిలేశ్వరపురం:** అంగర ,కపిలేశ్వరపురం ,టేకి ,తదితర గ్రామాల్లో అల్లూరి విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగర ఎస్ఐ అందే పరదేశి, పలువురు నాయకులు తదితరులుపాల్గొన్నారు.



ముమ్మిడివరం సిపిఎం కార్యాలయంలో అల్లూరి జయంతి




అమలాపురంలో అల్లూరి చిత్రపటం వద్ద ప్రజాసంఘాల నాయకుల నివాళి

## వంగవీటి రంగా ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-యంత్రాంగం

దివంగత నేత వంగవీటి మోహనరంగా జయంతిని జిల్లాలో పలుచోట్ల గురువారం నిర్వహించారు. ఆయన చిత్ర పటాలకు, విగ్రహాలకు పలువురు ప్రజాప్రతి నిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పిం చారు. వారు మాట్లాడుతూ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

**అమలాపురం:** వంగవీటి మోహన రంగా జయంతి సందర్బంగా స్థానిక నల్ల వంతెన వద్ద ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. వంగవీటి రంగా జయంతి వేడుకలలో నాయకులు జక్కంపూడి కిరణ్, నల్ల అజయ్, నల్ల సంజయ్, కల్వకోలను చిన్న, వంటెద్దు బాబి తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** వంగవీటి మోహనరంగా జయంతిని కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు.స్థానిక సెంటర్లోని రంగా విగ్రహానికి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ బాబు మాజీ సర్పంచ్ బండారు బుల్లి తాత , చీకట్ల అబ్బు ,బండారు వీరబాబు తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు:** వంగవీటి మోహన రంగా విగ్రహానికి రామానుజుల శేషగిరిరావు, ఈదల రాంబాబు, వంటిపల్లి సతీష్, ఈదల సత్యనారాయణ చౌదరి తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. **అమలాపురం (అల్లవరం) :** అల్లవరం సెంటర్లో రంగా విగ్రహానికి దెందుకూరు సత్తిబాబు రాజు తదితరులు పూలమాలలువేసినివాళులు అర్పించారు. **రామచంద్రపురం :** పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ , పట్టణ కాపు సంఘం అధ్యక్షులు నారపరెడ్డి బలరామ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, శ్రీధర్ ,పట్టణ కాపు సంఘం నాయకులు, కమ్యూనిటీ నాయకులు, పట్టణ ప్రముఖులు, కాపుసంఘం పెద్దలు, పాల్గొని రంగా విగ్రహాని పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. **ఉప్పలగుప్తం:** గొల్లవిల్లి సెంటర్‌లో రంగా రాధా మిత్రమండలి ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మిత్రమండలికి చెందిన ఆకుల సూర్యనారాయణ మూర్తి తదితరులుపాల్గొన్నారు. **మామిడికుదురు:** పెదపట్నం లంక, మామిడికుదురు లూటుకుర్రు, పాశర్లపూడి లంకలో రంగా జయంతి నిర్వహించారు. **రాజోలు:** బి.సావరం గ్రామంలో ఏర్పాటు చేసిన రంగా విగ్రహాన్ని ఎంఎల్ఎ ప్రజా రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ ఆవిష్కరించారు. రాజోలు సెంటర్లో జరిగిన రంగా జయంతి నిర్వహించారు రాజోలు ఉప సర్పంచ్ పామర్తి రమణ,కోళ్ల బాబి పాల్గొన్నారు.



వాడపాలెంలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ బండారు

## అన్ని రంగాల్లో జిల్లా పురోగమించే విధంగా చర్యలు

**జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో ఉన్న భౌగోళిక పరిస్థితులు వనరులు, అభివద్ధి అంశాల పై ఒకటి రెండు రోజులలో అధికార యంత్రాంగం ద్వారా అధ్యయనం చేసి జిల్లా అన్ని రంగాలలో పురోగమించే విధంగా చర్యలు తీసుకుంటామని నూతనంగా జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన రావిలాల మహేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో పాత్రికేయుల సమావేశం నిర్వహించి జిల్లాలో ఉన్న సమస్యలపై పాత్రికేయులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అత్యంత ఉత్పాదక శక్తి గల సారవంతమైన ప్రాంతం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అని తెలిపారు. తాను తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తినని విద్యా భ్యాసం అంతా విజయవాడలోని జరిగిందని పేర్కొ న్నారు. ఆంధ్రప్రదేశ్లో మంచి ఉత్పాదకత శక్తి కలిగిన సారవంతమైన భూములు కలిగి సాగునీటి వసతి కలిగి న ప్రాంతం కోనసీమ ప్రాంతమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమ ర్థవంతంగా అమలు చేసి పథకాల లబ్దిని చిట్ట చివరి లబ్ధిదారు వరకు చేరేలా కృషి చేస్తానని చెప్పారు. గతంలో తాను రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ గాను, కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్‌గా, విజయన గరం జాయింట్ కలెక్టర్ గాను తదుపరి ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూట్ సొసైటీ కార్యదర్శి గాను విధులు నిర్వహించి తొలిసారిగా కలెక్టర్గా పదవి బాధ్యతలను కోనసీమ జిల్లాలో చేపట్టానని తెలిపారు. ప్రతి ఏడాది సంభవించే గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదు ర్కొనే దిశగా పటిష్టమైన చర్యలు చేపట్టి ఎక్కడ ఎటువంటి ఆస్తి ప్రాణ నష్టాలు సంభవించకుండా భద్రతా పరంగా చర్యలను బలోపేతం చేస్తాన న్నారు. రబీ సీజన్లో కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలు త్వరగా చెల్లించేందుకు రాష్ట్ర పౌరసరఫలాలు అధికారులతో సంప్రదింపులు జరపామని తెలిపారు. పలువురు పాత్రికేయులు జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సమస్యలపై కూడా ప్రాధాన్యత క్రమంలో చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## విధుల నుంచి తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్‌కు పోస్టింగ్

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

గత వైసిపి ప్రభుత్వంలో అభియోగాలు మోపి విధుల నుంచి తొలగించిన కపిలేశ్వరపురం మండలం కాలేరు గ్రామ ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కొత్తపల్లి క్రాంతికుమార్‌కు తిరిగి గురువారం పోస్టింగ్ ఇచ్చారు. ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు చొరవతో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పోస్టింగ్ ఇప్పించారు. పోస్టింగ్ ఆర్డర్ కాపీని మండపేట టిడిపి కార్యాలయంలో క్రాంతి కుమార్‌కు ఎంఎల్ఎ వేగుళ్ళ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్లకు ఫీల్డ్ అసిస్టెంట్ క్రాంతికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేరు గ్రామ సర్పంచ్ దాయం కావేరి, దాయం శేఖర్ బాబు, వల్లూరి నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# నేరాలు ఘోరాలు

## అక్రమంగా తరలిస్తున్న డీజిల్ సీజ్

ప్రజాశక్తి - తాళ్లరేవు

యానాం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 2,800 లీటర్ల డీజిల్‌ను అధికారులు సీజ్ చేశారు. గురువారం మండలానికి చెందిన పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు పరిధిలోని జాతీయ రహదారి 216పై రెవెన్యూ, విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే యానంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నుంచి డీజిల్‌ను ఆక్వా చెరువుల వద్దకు ఆటోపై తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి ఆటోతోపాటు, డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో సివిల్ సప్లై డిటి. లక్ష్మీ ప్రసన్న, జిల్లా విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి, కోరంగి పోలీసులు సుదర్శన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని సైక్లిస్ట్ మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మూలస్థాన అగ్రహారం వద్ద 216(ఏ) జాతీయ రహదారిపై గురువారం కారు ఢీకొని సైక్లిస్ట్ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక గ్రామానికి చెందిన రేలంగి సూర్యనారాయణ అలియాస్ సూరయ్య(60) జొన్నాడ సెంటర్ వద్ద తన పని ముగించుకుని సైకిల్‌పై స్వగ్రామం మూలస్థానం వెళ్తుండగా రావులపాలెం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపుగా వెళ్తున్న కారు వెనుక నుంచి అతనిని ఢీకొంది. దీంతో సూర్యనారాయణ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందరన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తెలిపారు.

## బంగారు వస్తువుల చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఇంటి బీరువాలో దాచుకున్న బంగారు వస్తువులను తన సమీప బంధువు దొంగలించుకు పోయిందని ఒక మహిళ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ముమ్మిడివరం నగర పంచాయతీ బాలయోగి కెనాల్ రోడ్‌లో నివాసముంటున్న జిత్తుక సుజని ఇంటికి రాజోలు మండలం పొన్నమండ గ్రామానికి చెందిన తమ బంధువు సరేళ్ల తేజస్విని తరచూ వస్తూ ఉండేది. ఈ నేపథ్యంలో గత ఏడాది మే 16న తమ ఇంటికి వచ్చిన తేజస్విని బీరువాలోని సుమారు రూ.2 లక్షల 15 వేలు విలువైన బంగారు వస్తువులను బీరువా పగలగొట్టి దొంగలించి పోయిందని బాధితురాలు తెలిపింది. బంధువుల సమక్షంలో తగవు పెట్టినా బంగారు వస్తువులు తిరిగి ఇవ్వలేవని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సారా బట్టీపై దాడి : వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని సగ్గొండ పరిధిలో సారా బట్టిపై పోలీసులు దాడి చేసి ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారంతో సగ్గొండ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 140 వద్ద గోపవరం గ్రామానికి చెందిన నక్క సత్యనారాయణ అనే వ్యక్తి నాటు సార తయారు చేస్తున్న బట్టిపై దాడు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో అతను వద్ద ఉన్న రూ.6000 విలువ గల 20 లీటర్ల నాటు సారాను సీజ్ చేసి, 30 వేలు విలువ గల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ముద్దాయిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

స్కూల్ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. బుధవారం మండలంలోని దొండపూడి శివారులో జరిగిన ప్రమాదానికి సంబంధించిన వివరాలను గురువారం ఎస్ఐ కె.సతీష్‌కుమార్ వెల్లడించారు. వెంకటరెడ్డిగూడెంలో నివాసం ఉంటున్న కారం సురేష్ బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి తన స్నేహితుడు కొమరం రాంప్రసాద్ మోటారు సైకిల్‌పై గోపాలపురం మండలంలోని దొండపూడి గ్రామానికి వస్తుండగా స్కూల్ బస్సు మోటార్ సైకిల్‌ను ఢికొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న కారం సురేష్ తీవ్రగాయాలవ్వడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతిని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామంలో కొత్త ఇంట్లో తాపీ పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌తో తాపీ మేస్త్రి మృతి చెందిన సంఘటన చాగల్లు గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. మృతుడు సానుబోయిన వీర వెంకట సత్యనారాయణ (37) కొత్తపేటలోని ఒక ఇంట్లో తాపీ పని చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ మేరకు అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వ్యక్తి అనుమానాస్పద మరణం

ప్రజాశక్తి - నల్లజర్ల

అనంతపల్లిలో ఒక వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. గురువారం ఉదయాన్నే స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మృతి చెందిన వ్యక్తి తమిర్చి వెంకటేశ్వరరావు (48)గా స్థానికులు గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం కాగా భార్య సావిత్రి కుమారుడు నాగరాజు వెంకటేశ్వరరావుతో విడిపోయి కొంతకాలంగా వేరేగా జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో మృతి చెందడంతోపాటు, సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ వరకు రక్తపు మరకలు ఉండటంతో బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నల్లజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బోల్తా పడ్డ కాంక్రీట్ మిక్సర్

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కాంక్రీటు మిక్సర్ గురువారం కాటవరం రైస్ మిల్లు మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. కాంక్రీట్ మిక్సర్ వేగంగా వస్తూ డివైడర్ ను ఢీకొట్టి బోల్తా పడింది. అదే సమయంలో సీతానగరం వెళ్తున్న ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ప్రమాద సంఘటన ప్రాంతం వద్ద ఆగి ప్రమాదంలో గాయపడ్డా డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు.

# యానాం వార్తలు



ప్లాంట్ మేనేజర్‌కి వినతి పత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

## మహిళా కార్మికుల తొలగింపు దారుణం

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని అడవి పొలంలో షెల్డం ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న మహిళా కార్మికులను అక్రమంగా తొలగించడం దారుణమని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం కార్మికుల సమస్యలపై ప్లాంట్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం స్థాపించిన షెల్డం కంపెనీలో సుమారు 70 మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకుండా, మహిళా కార్మికుల శ్రమను దోచుకుంటూ రోజుకు రూ.200 మాత్రమే యాజమాన్యం చెల్లిస్తుందన్నారు. గతంలో ఐదున్నర గంటలకే ఇంటికి పంపేవారని, ప్రస్తుతం సాయంత్రం 6:00 వరకూ పని చేయించుకుంటున్నారన్నారు. అదనంగా పనిచేసిన దానికి వేతనం కట్టడం లేదని ఆరోపించారు. అదనపు వేతనం కట్టాలని ప్రశ్నించినందుకే రాయుడు ప్రసన్న, చోడే మంగాదేవి, నందికి శ్రీదేవి, రమణ అనే మహిళా కార్మికులను అక్రమంగా తొలగించారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా షెల్డం పరిశ్రమ యాజమాన్యం వ్యవహరిస్తుందని ఆరోపించారు. అక్రమ తొలగింపులు ఆపాలని, కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్, మెటర్నటి లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ కె.సత్యనారాయణ, సబ్బతి రాంబాబు, త్రికోటి శ్రీనివాసరావు, దాసరి రాజు, సలాది నాగబాబు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన ఎంఎల్ఎ గొల్లపల్లి

ప్రజాశక్తి - యానాం



చంద్రబాబును సత్కరిస్తున్న అశోక్

ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపి సిఎం చంద్రబాబును యానాం ఎంఎల్ఏ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలను చర్చించినట్లు ఆయన మీడియాకు తెలిపారు. టిటిడి ద్వారా మీసాల వెంకన్న ఆలయ పున్ణర్నిర్మాణనికి, సాగు, తాగునీటి సరఫరాకు సహకరించాలని కోరినట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, అమరావతిలో మరోసారి కలిసి సమస్యలపై చర్చించేందుకు రావాలని ఆహ్వానించారని తెలిపారు.

## ఘనంగా అల్లూరి జయంతి

ప్రజాశక్తి - యానాం

అల్లూరి సీతారామరాజు జయంతి, వివేకానంద, పింగళి వెంకయ్య వర్ధంతిలను సమాచార శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న వారి విగ్ర హాలకు ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎస్‌పి రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్ఐ మురుగానందం పాల్గొన్నారు.

## మిషన్ శక్తిపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి పథకంపై అవగాహన కల్పించారు. గురువారం మిషన్ శక్తి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రిపిక రోసెలిన్ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అడ్వకేట్ పడాల సుబ్బారావు నూతన క్రిమినల్ చట్టాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ ఉమా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహా, పుణ్య, తేజస్వి, సుధా, విజయ తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయేరియాపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో డయేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్య శాఖ అధికారి టి.రవిశంకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్ర మాన్ని స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రారంభిస్తారని తెలిపారు.

## తూతూ మంత్రంగా ఎర్ర పోతవరం గ్రామసభ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలో ఎర్రపోతవరం గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభ తూతూ మంత్రంగా జరిగింది. గ్రామ కార్యదర్శి దామిశెట్టి రామాంజనేయులు గ్రామసభ ఏర్పాటు చేశారు. అయితే సర్పంచ్ ఒక కేసులో అరెస్ట్ అవ్వడంతో పాటు ఉపసర్పంచి వార్డు సభ్యులు ఎవరు గ్రామసభకు హాజరు కాకపోవడంతో వచ్చిన గ్రామస్తులతోనే సభను తూతు మంత్రంగా నిర్వహించారు. అయితే గ్రామంలో పలు అవతవకలు జరిగాయంటూ యువకులు అధికారులను నిలదీశారు. దీంతో కొద్దిసేపు సమావేశం రసాభాసగా మారింది. గ్రామ కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు జరిగే గ్రామసభను యథావిధిగా నిర్వహించామని, అయితే సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు సమా వేశానికి రాలేదన్నారు. విఆర్ఒ శరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కులను పునరుద్ధరించాలని వినతి

ప్రజాశక్తి-రాజోలు

ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు గత ప్రభుత్వంలో నిర్వీర్యమైపోయిన రాజ్యాంగ హక్కులను, రాయితీలను, అవకాశాలను, నిధులను పునరుద్ధరణ చేయాలని రాజోలు డిప్యూటీ తహశీల్దార్ ఎస్ శ్రీనివాస్‌కు దళిత చైతన్య వేదిక నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు జిల్లా రాజోలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట దళిత చైతన్య వేదిక నాయకులు గురువారం గత ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమైన ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ పథకాలను, కార్పొరేషన్ నిధులను, సబ్ ప్లాన్ నిధులను పునరుద్ధరణ చేయ్యాలని నినాదాలు చేశారు. అనంతరం రాజోలు డిప్యూటీ తహశీల్దార్ కు మెమోరాండం ఇచ్చిన దళిత చైతన్య వేదిక నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వంలో దళితులకు రాజ్యాంగ బద్ధంగా దక్కాల్సిన ఉపప్రణాళిక నిధులు, కార్పొరేషన్ నిధులు, ఎస్‌సి సంక్షేమ పథకాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్‌సి కార్పొరేషన్ నిధులను, ఉప ప్రణాళిక నిధులను, సంక్షేమ పథకాలను పునరుద్ధరణ చేసి ఎస్‌సి, ఎస్‌టి వర్గాల పురోభివద్ధికి కషి చేయ్యాలన్నారు. కార్యక్రమంలో వేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకష్ణ, సమన్వయ కర్త బత్తుల జనార్ధనారావు, ఉపాధ్యక్షులు చిలకపాటి శ్రీధర్, నాయకులు మందపాటి మధు, జిల్లెళ్ళ వినోద్,మట్టా సురేష్, దీపాటి శివప్రసాద్, తెన్నేటి నాగేశ్వరరావు, బొడ్డపల్లి పుల్లయ్య, పాముల హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కిక్ బాక్సింగ్‌లో కలవచర్ల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-ఆలమూరు

తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరులో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కిక్ బాక్సింగ్ పోటీల్లో మండలంలోని కలవచర్ల మదర్ థెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విజేతలు వివరాలు జూనియర్స్ 35 కేజీల విభాగంలో ఖండవిల్లి మహిమకర్ గోల్డ్ మెడల్, 38 కేజీల విభాగంలో వడ్డి కార్తికేయ గోల్డ్ మెడల్, 40 కేజీల గెద్దాడ జాయ్ కిరణ్ సిల్వర్ మెడల్ సాధించారు. గర్ల్స్ 45 కేజీల విభాగంలో వడ్డి గిరిజ సిల్వర్ మెడల్, సీనియర్ 55 కేజీలు విభాగంలో చల్లా వీరేంద్ర ప్రసన్న కుమార్ గోల్డ్ మెడల్, 60 కేజీలు భాగంలో మెరుపే సత్య కాంత్ సిల్వర్ మెడల్ సాధించారు. విజయవాడ జగ్గయ్యపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో ఆలమూరు గ్రామానికి కీర్తి జస్వంత్ గోల్డ్ మెడల్ సాధించినట్లు మదర్ థెరిసా స్పోర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ తాతపూడి అబ్బులు గురువారం తెలిపారు.

# కబ్జాలో ఉన్న స్థలం స్వాధీనం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



ద్వారంపూడి కబ్జాలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకుంటున్న భూ యజమానులు

గత ప్రభుత్వ పాలనలో కబ్జాకు గురియైన స్థలాన్ని ఎట్టకేలకు భూ యజమానులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వాకలపూడి గ్రామంలో మహిమ చర్చ్ ఆవరణలో 192/ఎ, 154/85, 156/85, 157/85 సర్వే నెంబర్లకు సంబంధించి నాలుగున్నర ఎకరాల భూమిని రెండున్నర ఏళ్ల క్రితం నాటి ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి బంధువు భీమస్ రెడ్డి కబ్జా చేశారు. స్థలం చుట్టూ ప్రహరీగోడ నిర్మించాడు. దీంతో స్థల యజమానులు సర్పవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయినా వారికి న్యాయం జరగలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో స్థల యజమానులు ధైర్యం చేసి గురువారం ప్రహరీగోడను జెసిబితో కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, స్థల యజమానులు విశ్వనాథం, శ్రీలక్ష్మి మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం స్థలాన్ని కొనుగోలు చేశామన్నారు. అప్పటి నుంచి పన్నులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. అయితే ఆ స్థలంలో ఉన్న చర్చిని, పక్కనే ఉన్న షెడ్లను గతంలో ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి రౌడీలతో బెదిరించి పోలీసుల అండతో ప్రహరీ గోడ కట్టించి తాళాలు వేశారన్నారు. ప్రభుత్వం మారడంతో మాకు ధైర్యం వచ్చి రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి విషయాన్ని వివరించి మా స్థలాన్ని మేము కాపాడుకోవడం జరిగిందని తెలిపారు. మమ్ములను బెదిరించి రౌడీలతో దాడులు చేయించిన మాజీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరారు. వారాహి కాలనీగా నామకరణం చేసుకున్నట్లు వారు తెలిపారు.

# 700 సిసిఆర్‌సి కార్డుల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట



ఎఒ సత్య

మండల పరిధిలో 700 మంది రైతులకు సిసిఆర్‌సి కార్డులు అందజేసినట్లు వ్యవసాయ అధికారి ఇమ్మడిశెట్టి సత్య తెలిపారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సుమారు 6100 మంది రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా తీసుకున్నామని, ఇప్పటి వరకూ 700 మంది రైతులకు కార్డులు అందించామన్నారు. మండలంలో ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. సమాయాత్తంగా ఉన్నామన్నారు. మండలంలో 9,500 హెక్టార్లలో వరిసాగు సాగాల్సి వుండగా, ప్రస్తుతం 9,200 హెక్టార్లలో సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. 80శాతం ఎదజల్లే పద్ధతిలో వరిసాగు జరుగు తుండగా, 20 శాతం నాట్లు వేసే పద్ధతిలో జరుగుతుందన్నారు. ఇప్పటికే 12 వందల హెక్టార్లలో ఈ పద్ధతిన నాట్లు పూర్తయినట్టు చెప్పారు. యూరియా, డిఎపి, పోయాషియం ఎరువులు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. మండలానికి 75 క్వింటాళ్ళు విత్తనాలు రాగా కిలోకు రూ. 5 చొప్పున రాయితీపై రైతులకు రైతు సేవా కేంద్రల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు.

## చిరుధాన్యాల సాగు ద్వారా అధికాదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మెట్ట భూముల్లో చిరుధాన్యాలను సాగు చేయుట ద్వారా రైతులు అధికాదాయం పొందవచ్చునని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని వాలు తిమ్మాపురం గ్రామంలోసైనం సాల్మన్‌రాజు వ్యవసాయ క్షేత్రంలో కర్ర పెండలం దుంప సాగు రైతులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తుందన్నారు. మెట్ట ప్రాంతం చిరుధాన్యాల సాగుకు ఎంతో అనుకూలంగా ఉందన్నారు. ఎకరానికి మూడు కిలోలు చొప్పున రాగులు విత్తనాలు వేసుకున్నట్లయితే 120 రోజులు పంట కాలం తర్వాత 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. డిడిఎ హరి మాట్లాడుతూ కర్ర పెండలం దుంపకు ప్రత్యామ్నాయంగా మెట్ట ప్రాంతాల్లో అపరాలు సాగు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం ఏసుబాబు, బూసి శ్రీను, పితాని వీరభద్రరావు, భీమరాజు, ఎడిఎ మాధవి, ఎన్‌డిఎ ఎన్.దేవకుమార్, ఎఒ కె.సంజయ్‌కుమార్, ఎఇఒ ఎన్.ప్రసాద్, బిహెచ్ఎ మల్లిక పాల్గొన్నారు.

## ధాన్యం బకాయిల విడుదలపై హర్షం

ప్రజాశక్తి - కరప

గత ప్రభుత్వంలో ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలు విడుదల కావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండలానికి చెందిన 525 మంది రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలు రూ.4,98,18,000లు విడుదలయ్యాయని ఎంఎల్ఎ పంతం నానాజీ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే గురువారం మండలానికి చెందిన పలువురు రైతులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు బండారు మురళి మాట్లాడుతూ రైతులకు రావాల్సిన బకాయిల అంశాన్ని ఎంఎల్ఎ పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే అధికారులతో మాట్లాడి బకాయిలను విడుదల చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఎంఎల్ఎ నానాజీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముత్యాలరావు, గుణ్ణం ఉదయశంకర్, పాలిక సూరిబాబు, కొప్పిశెట్టి బుజ్జి శ్రీను, జి.శ్రీను, పబ్బినీడి బాబ్జి రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలి

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థుల్లో పఠన, రాత నైపుణ్యాలను పెంపొందించాలని ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య ఆదేశించారు. గురువారం ఆయన మండలానికి చెందిన మాధవపట్టణం జమునా నగర్ ప్రాథమిక పాఠశాల, వికె.రాయపురం సత్యవరపుపేట ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో హాజరు శాతం, ఎన్రోల్మెంట్ డ్రైవ్, ర్యాలీ కార్యక్రమాల గురించి ఆరా తీశారు. పాఠశాల విద్యార్థులు పఠన, రాత నైపుణ్యాలు, విద్యార్థుల వర్క్ బుక్, టెక్స్ట్ బుక్ కరెక్షన్స్, సిలబస్‌ను పరిశీలించారు. విద్యార్థులు అందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ వాటి గూర్చి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సత్యవరపు పేట ప్రాథమిక పాఠశాలలో 'నాడు నేడు'లో చేపట్టిన కిచెన్ షెడ్ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల వాయిదా తగదు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల వాయిదా తగదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు గురువారం ఓ ప్రకటనలో అన్నారు. మెగా డిఎస్‌సిపై తొలిసంతకం చేసిన ముఖ్యమంత్రి హామీ ఆచరణకు రాకుండా ఉన్న నోటిఫికేషన్ రద్దు కావడం 6 నెలల వాయిదాపడటం దురదృష్టకరమన్నారు. 3 లక్షల మంది సచివాలయ వాలంటీర్ల విషయంలో నిర్దిష్ట ప్రకటన చేయలన్నారు. ఎక్సైజ్ పాలసీ మారుతున్నందున ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న 20 వేల మందికి భవిష్యత్తుకు మార్గం చూపాలన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టో హామీ ప్రకారం డిప్లొమా నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతీ యువకులకు ఉద్యోగాలు వచ్చేవరకు నిరుద్యోగ భృతి రు.3 వేలు అందజేసే ప్రభుత్వ కార్యాచరణ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అయినవిల్లి విఘ్నేశ్వరుని దర్శించుకున్న కలెక్టర్

ప్రజాశక్తి-అయినవిల్లి



ఆలయ సన్నిధిలో కలెక్టర్ దంపతులు

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్ గురువారం సతీసమేతంగా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి దేవదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలకగా, అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

### కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఎస్‌పి శ్రీధర్

జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన రావిరాల మహేష్ కుమార్‌ని జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్, జిల్లా అదనపు ఎస్‌పి ఎస్ ఖాదర్ బాషా కలెక్టరేట్ వద్ద మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియజేసినారు.

## చెముడులంకలో 'నేను బడికి పోతా' ర్యాలీ

ప్రజాశక్తి-ఆలమూరు

మండల విద్యాశాఖ అధికారులు పి.సాలెం రాజు పి.వి.సుబ్బరాజు పర్యవేక్షణలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని మండలంలోని చెముడు లంక ఎస్టిఎస్ఎన్ఎం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేను బడికి పోతా" ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని అన్నారు.బడి ఈడు పిల్లలు అందరూ బడిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో నేతలు నాగిరెడ్డి వెంకటరత్నం, లంకలపల్లి ఆంజనేయులు, కొత్తపల్లి రాంబాబు, పాలూరి అర్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంచెలంచెలుగా జిల్లాను అభివృద్ధి చేశాం

ప్రజాశక్తి-అమలాపురం

నూతనంగా ఏర్పడిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వనరులు తక్కువగా ఉన్నప్పటికీ జిల్లా కార్యాలయాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేశామని బదిలీపై వెళుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వ హించి జిల్లా కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని పలు రకాలుగా నిధులు సమకూర్చుకుంటూ అన్ని వసతులు కల్పించామన్నారు.



**MUNICIPAL CORPORATION, RAJAMAHENDRAVARAM**

**Engineering Section : e-Procurement Tender Notice**

NIT No. 666/MCR 15th FC/2024-25 Dt: 02-07-2024

Online tenders are invited from the eligible contractors on e-procurement for 1 work for with an Estimated Contract Value of **Rs. 66,12,316/-**

**1.** Tenders can be down loaded. The tender schedules for the above works will be available from 02-07-2024 at 09.00 P.M on wards. 2. Last date of time of receipt of tenders on or before dt. 18-07-2024 upto 2.00 PM.

**3.** Further details can be seen at 'e'-procurement website www.apeprocurement.gov.in & https://tender.apeprocurement.gov.in

Sd/- **K.DINESH KUMAR,** *I.A.S.,*
COMMISSIONER
Municipal Corporation, Rajamahendravaram

**పాస్‌పోర్టు పోయినది**

తోట కృష్ణవేణి, భర్త: రామకృష్ణ అను నా యొక్క **T8551970** నంబర్ గల పాస్‌పోర్టు డోర్ నెంబర్: 14-50/1, లక్కవరం కాలనీ, ఏలేశ్వరం నందు గల మా ఇంట్లో పోయినది. ఎవరికైనా దొరికిన ఈక్రింది చిరునామాకు తెలుపగలరు.

**తోట కృష్ణవేణి**
భర్త: రామకృష్ణ
డోర్ నెంబర్: 14-59/1
లక్కవరం కాలనీ, ఏలేశ్వరం గ్రామం
ఏలేశ్వరం మండలం, కాకినాడ జిల్లా
సెల్: 8008516118

**ప్రకటన**

నా క్లయింటు తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం పట్టణం, డోర్ నెం. 88-3-5, గాడాలమ్మ నగర్, మోరంపూడి గ్రామ కాపురస్తురాలు చింతలపాటి వెంకట సత్య సూర్య రఘురామరాజు గారి భార్య చింతలపాటి రాధ గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటుకు తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఆర్.ఎస్. నెం. 369/2బి, 370/1 లో లేఅవుట్ చేయబడి ఎల్.పి. నెం. 3/2005 గా అప్రూవల్ చేయబడిన ప్లాట్లులో నా క్లయింటుకు గల ప్లాటు నెం. 15, 16లకు సంబంధించిన దస్తావేజులు నెం. 3820/2005, 3817/2005 ర్లుగా ది. 28-1-2005వ తేదీన రిజిష్టరీ చేయబడిన దస్తావేజులు నా క్లయింటు పెద్దాపురం మెయిన్‌రోడ్డులో జిరాక్సు తీసుకొనుటకు తెచ్చుకొనగా ది. 28-6-2024వ తేదీన పడిపోయినవి.

కావున సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని అందజేయవలసినదిగా కోరడమైనది.

**వేదుల సుబ్రహ్మణ్యం, అడ్వకేట్**
పెద్దాపురం, సెల్: 90526 99989

**మహారాజశ్రీ పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

**E.P. 3/2024, O.S. 42/2022**

బిట్వీన్:
పడాల సూర్యప్రభ -డిక్రీ హోల్డర్/వాది
Vs
బుద్దాల వీర వెంకటరమణ -జడ్జిమెంటు డెట్టార్/ ప్రతివాది

*జడ్జిమెంటు డెట్టార్/ ప్రతివాది:*
బుద్దాల వీర వెంకట రమణ, S/o. నూకరాజు, హిందు, 62 సం॥రంలు, డోర్ నెం. 3-36, తిరుపతి గ్రామం, పెద్దాపురం మండలం.

పై నంబరు అమలు గ్రంథములో మీకు ఎన్నిసార్లు కోర్టు వారు నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ హాజరు నిమిత్తం ది. 12-08-2024 నాటికి వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయంగా గాని, ప్లీడరు గారు ద్వారా గాని **ది. 12-08-2024న ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారు ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని మీకు తెలియజేయబడినది.

**యన్.వి.యస్.మూర్తి (బాలు)**
**కె.ఎం.ఎల్.గణేష్**
అడ్వకేట్లు, పెద్దాపురం

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం**

**T.O.P.(Crl)No.26/2023**

Between:
శ్రీమతి నిమ్మగడ్డ అరుణకుమారి ...పిటీషనర్
And
R1.నలమాటి కృష్ణకాంత్, S/o.వీరయ్యచౌదరి, వయస్సు 27, బిజినెస్, స్నేహపురం విలేజ్, కరప మండలం, తూ.గో.జిల్లా.
R2.నిమ్మగడ్డ శ్రీనివాస్, S/o.సత్యనారాయణ, బిజినెస్, డోరునెం.69-15-21/1, శ్రీనివాస నగర్, బ్యాంకు కాలనీ, కాకినాడ, తూ.గో.జిల్లా.
... 1,2 Respondents

పై నంబరు పిటిషన్‌లో 1,2 రెస్పాండెంట్స్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పివేయుచున్నారు. కావున **ది.12-7-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీకోర్టు వారు తీర్మానించెదరు.

రాజమండ్రి జె.వి.సుబ్బారావు
4-7-2024 అడ్వకేటు,రాజమండ్రి.

**ప్రకటన**

**మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి మరయు సెషన్స్ జడ్జి వారి కోర్టులో**

**DOP.No.35/2019**

**పిటీషనరు :**
**బొడ్డుకోళ్ళ వసంత కుమార్,** S/o.జయరాజు, వయస్సు 40 సం॥లు, ప్రైవేట్ ఎంప్లాయి, యర్రంపల్లి గ్రామం, చింతలపూడి మండలం, ప.గో.జిల్లా.
**రెస్పాండెంటు :**
**బొడ్డుకోళ్ళ షకిన,** W/o.వసంత కుమార్, వయస్సు 26 సం॥లు, ప్రైవేట్ ఎంప్లాయి, చింతచెట్టు వారి వీధి, నల్లజర్ల గ్రామం మరియు మండలం, ప.గో.జిల్లా.

సదరు పై నెంబరు గ్రంథమున శ్రీకోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసియున్నప్పటికినీ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **ది.19-07-2024 సం॥ తేదీన ఉదయం 10.30 ని॥లకు** శ్రీకోర్టు వారి యెదుట హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

**కోడూరి సూర్యరాఘవులు**
కొవ్వూరు అడ్వకేట్,కొవ్వూరు.
తేది: 4-7-24 సెల్: 9441116118

**In the Court of the 9th Additional District Judge (MACT) at Kovvur, W.G.Dt.**

**M.V.O.P. No. 30/2022**

*Between:*
1. Smt. Katta Soma Sekhar ***...Petitioner***
AND
1. Sri. Punith Ravidas and Others ***...Respondents***

**Notice to 1st Respondent**

***1st Respondent:***
Punith Ravidas, S/o. Sadhu Ravidas, Male, Hindu, Driver of Lorry bearing No. AP 16 TS 6516, R/o. Padima Village, 1st Ward, Punvhamdo barhi Post, Barhi Tana Paima Village, Barhi, Hazaribagh, Jharkhand State.

In the above matter you are the 1st Respondent and for your appearance the case was posted to **12-07-2024.** On that day you can appear on your own or through an Advocate before the Hon'ble Court **at 10.30 A.M.** Hence the case is decreed against you in your absence.

*(Order of the Hon'ble Court)*

**KODURI NARASIMHA RAO**
Advocate, Kovvur
E.G.Dt., A.P.

**మహారాజశ్రీ 2వ అడిషినల్ సీనియర్ సివిల్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం**

**I.A. 581/2023, I.A. 582/2023 I.A. 583/2023 in O.S. 223/2018**

*Between:*
1. Nagubandi Padma
2. Nagubandi Prasanna Kumar @ Bujji
3. Nagubandi Raja Kalyan @ Raj Kalyan
4. Nagubandi Devi Charan @ Devi
5. Garlapati Rajeswari
6. Ponnuru Anuradha

***...Petitioners/ Plaintiffs***
AND
Nagubandi Satyavathi and Others
***...Respondents/ Defendants***

***R-4:*** Nagubandi Subba Lakshmi, W/o. Nagubandi Venkata Surya Naga Ratnaji @ Ratnaji, Hindu, Housewife, aged 80 years, R/o. D.No 2-8, Korukonda, Korukonda Mandal, E.G.Dist.,
***...4th Respondent/ Defendant***

పై నంబరు పిటిషన్‌లో 4వ రెస్పాండెంటు/ డిఫెండెంట్ అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 08-7-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

*(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)*

రాజమండ్రి **జి.ఎస్.ఎస్.మురళీమోహన్**
20-6-2024 అడ్వకేట్, రాజమండ్రి